

# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 291 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు శుక్రవారం, 14 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 291 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR FRIDAY, 14 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


- అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా
- వారే లేకుంటే అమరావతే లేదన్నది సత్యం
- రైతులను భాగస్వాములను చేసేందుకే ల్యాండ్ పూలింగ్
- గ్రాఫిక్స్ అన్నవారికి చెంపపెట్టులా నిర్మాణాలు
- సైబరాబాద్ స్ఫూర్తితో అమరవాతి నిర్మాణానికి అడుగు
- స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు

## అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్‌కు ప్రతీక

. ఏపీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. అమరావతి రైతుల త్యాగమే కాదని.. స్ఫూర్తి కూడా చాలా గొప్పదని ప్రశంసించారు. నాడు రాజధాని ఎక్కడ కట్టాలనే సందిగ్ధత ఉండేదని తెలిపారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఇందుకోసం ఓ కమిటీ వేశారని ప్రస్తావించారు. రాజధానిగా అమరావతినే మెజార్టీ ప్రజలు కోరుకున్నారని ప్రస్తావించారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ఆనాడు సైబరాబాద్‌ను నిర్మించామని చెప్పారు.





## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

- అక్రమాలపై నిలదీస్తే కేసులతో జైళ్లకు పంపుతున్నారు
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టే ఇందుకు నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం

స్థానిక ఎస్పై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడక పోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విరగ్గొట్టారని వెల్లడించారు.



## గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు

- జగన్ హయాంలో అనుయాయులకు పోస్టులు
- అక్రమాలపై ఎక్కడిక్కడ నిలదీయండి
- మంత్రులకు చంద్రబాబు దిశానిర్దేశం



## సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళిక

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంపొందిస్తూ బందీ ఏనుగుల డీఎన్‌ఏ డేటాబేస్‌తో పాటు ఏనుగుల కదలికలను పర్యవేక్షించే 'గజ సూచన' యాప్‌ను వినియోగిస్తున్నామని

- ఏనుగుల సంరక్షణతో పాటు జీవనోపాధి
- ఏనుగులతో పంటనష్టం, ప్రాణనష్టంపై ఆందోళన
- కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్



## అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు

- ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు
- మాజీ స్పీకర్ పోచారం మరోమారు హాట్ కామెంట్స్



## తెలంగాణను దోచుకోవడంలో బిఆర్ఎస్‌తో పోటీ

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపి రఘునందన్ రావు
- యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్






## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు

## ఇసిఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

### అప్రమత్తంగా ఉండాలన్న సిఇవో

హైదరాబాద్: ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దరఖాస్తు నింపాలని కోరుతున్నారని తెలిపారు. బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్, అ÷ఎ, ం÷ఓ ఖఎఔలను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఇఅఎ, తెలంగాణ అఇక్ష కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. మోసపూరిత సందేశాలు వస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.





## బిసి మహిళలకు స్వయం ఉపాధి

ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం

## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు



న్యూఢిల్లీ: అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్-ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్‌కు ప్రతీక



అమరావతి: అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారు ముందుకు రాకుంటే ఇవాళ రాజధాని నిర్మాణాన్ని ఊహించలేమని అన్నారు. గత ప్రభుత్వం వారిని కేసులతో అనేక ఇబ్బందులకు గురిచేసినా, రాజధాని కోసం త్యాగాలకు వెరవలేదని అన్నారు. రాజధాని అమరావతిని కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జీల ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద శిలాఫలకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరైన రైతులు, స్థానికులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు.

రాష్ట్ర విభజన తర్వాత ఏమవుతుందో తెలియని స్థితిలో అందరం ఉన్నామని, రాజధాని ఎక్కడ నిర్మించాలో అర్థం కాని పరిస్థితి అన్నారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో కమిటీ వేశారు. మెజారిటీ ప్రజలు అమరావతినే సూచించారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించి నిర్మాణానికి సంకల్పించా.. కేవలం ఓ 50 ఎకరాల్లో భవనాలు నిర్మించవచ్చని, అయితే భవిష్యత్ ఏం కావాలన్న ప్రశ్న ఉదయించడంతో అమరావతి నిర్మాణానికి పూనుకున్నామని అన్నారు. అయితే ఇందుకోసం భూములు కావాలి కదా? మహానగరంగా ఎలా చేయాలని ఆలోచిస్తే.. ల్యాండ్‌పూలింగ్ కాన్సెప్ట్ వచ్చింది. రాజధాని నిర్మాణంలో రైతులను భాగస్వాములను చేస్తే బాగుంటుందని ఆలోచించా. ఒక్కమాట చెప్పగానే.. నన్ను నమ్మి భూములిచ్చేందుకు అన్నదాతలు ముందుకొచ్చారు. నోటిఫికేషన్ ఇచ్చిన 58 రోజుల్లోనే రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. 33వేల ఎకరాలు ఇచ్చేందుకు.. 29వేల మంది రైతులు ముందుకొచ్చారు. అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని నాటి సంగతులను సీఎం చంద్రబాబు వివరించారు.సింగపూర్ మోడల్‌తో అమరావతిని నిర్మిస్తున్నామని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తనపై ఉన్న నమ్మకంతో ఆ ప్రభుత్వం ఉచితంగా ప్లాన్ ఇచ్చారని అన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుతో అమరావతికి కనెక్టివిటీ పెరగనుందని పేర్కొన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించా నని తెలిపారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులకు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. రైతులు లేకపోతే రాజధాని లేదని చెప్పుకొచ్చారు. ఆనాడు అమెరికాలో పర్యటించి.. సైబరాబాద్ రూపకల్పన చేశామని ప్రస్తావించారు. రూపాయి తీసుకోకుండా అమరావతి కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ రూపొందించిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఏపీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. అమరావతి రైతుల త్యాగమే కాదని.. స్ఫూర్తి కూడా చాలా గొప్పదని ప్రశంసించారు. నాడు రాజధాని ఎక్కడ కట్టాలనే సందిగ్ధత ఉండేదని తెలిపారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఇందుకోసం ఓ కమిటీ వేశారని ప్రస్తావించారు. రాజధానిగా అమరావతినే మెజార్టీ ప్రజలు కోరుకున్నారని ప్రస్తావించారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ఆనాడు సైబరాబాద్‌ను నిర్మించామని చెప్పారు.

హైదరాబాద్ ఆదాయం పెరగడానికి తాను చేసిన అభివృద్ధే కారణమని పేర్కొన్నారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతిని ఎంపిక చేశామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆనాడు హైటెక్‌సిటీ నిర్మిస్తే కొంతమంది ఎగతాళి చేశారని అన్నారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని వెల్లడించారు. హైటెక్‌సిటీ నిర్మాణం దశలోనూ ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని చెప్పారు. విమర్శలు పట్టించుకోకుండా సైబరాబాద్ నిర్మాణంపై దృష్టి పెట్టామని తెలిపారు. ఇప్పుడు హైదరాబాద్ ఎదుగుదల చూసి గర్వపడుతున్నామని అన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించానని చెప్పారు. హైదరాబాద్‌ను మించిన మహానగరాన్ని నిర్మించాలని తాము సంకల్పించామని అన్నారు. సింగపూర్ మోస్ట్‌లివబుల్ కంట్రీ.. అందుకే ఆ మోడల్ తీసుకున్నామని వెల్లడించారు. గ్రాఫిక్స్ అంటూ అమరావతిని వైసీపీ నేతలు ఎగతాళి చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడొచ్చి చూడండి.. అమరావతి ఎలా ఉందో అని ప్రశ్నించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా ఆనాడు అమరావతిని రాజధానిగా అంగీకరించారని ప్రస్తావించారు. 5,10 కాదు.. 40వేల ఎకరాలు కావాలని జగన్ చెప్పారన్నారు. ఆ తర్వాత రాజధాని పేరుతో జగన్ మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. జగన్ హయాంలో రాజధాని రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది.. అమరావతి ఉద్యమమని తెలిపారు. అమరావతి చరిత్రలో రైతులకు ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. దేవతల రాజధాని అమరావతి.. ఇక్కడ ఇబ్బందులు ఉండవని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సీడ్ యాక్సెస్ రహదారి ద్వారా రాజధానికి రాజమార్గం ఏర్పాటు చేసుకున్నాం. అమరావతిని ఆపడం ఇక ఎవరితరం కాదు. నీటి సమస్యలేని ఏకైక రాజధాని అమరావతి. విద్యుత్ స్తంభాలు, వైర్లు కనిపించని ఆధునిక నగరమిది. గ్యాస్‌తో సహా అన్నీ భూగర్భం నుంచే వెళ్లే రాజధాని మన అమరావతి. ఇవాళ ప్రారంభించిన రోడ్డు చిన్న ట్రైలర్ మాత్రమే. రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్ట మొదటి సక్సెస్. రాష్ట్రాభివృద్ధిలో మొదటి మెట్టు ఎక్కాం. రాజధానితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. హెల్తీ వెల్తీ హ్యాపీ కావాలన్నదే అందరి సంకల్పం కావాలి. అమరావతి నిర్మాణం చేసి చరిత్ర సృష్టిస్తున్నందుకు గర్వంగా ఉందని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రలుఉ పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బిసి మహిళలకు స్వయం ఉపాధి

### ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం




హైదరాబాద్: బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్దిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్దిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 మూల్యాంకనంతో వైసీపీ అడ్డంగా దొరికిపోయిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తమ వారికి ఉద్యోగాలు ఇప్పించుకునేందుకు అర్హులను బలి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు గురువారం మధ్యాహ్నం లంచ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రూప్-1 అంశం చర్చకు వచ్చింది. గ్రూప్-1 మూల్యాంకనంలో 97 శాతం జవాబు పత్రాలు దిద్ది ఉండటంపై సీఎం చంద్రబాబు, మంత్రులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లతో జవాబు పత్రాలు దిద్దించడంపై పలు పత్రికలు, ఛానళ్లలో వచ్చిన వార్తలను చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారని సీఎంకు మంత్రులు వివరించారు. ఈ సందర్భంగా త్వరలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లోనూ గ్రూప్-1 వ్యవహారంపై వైసీపీని ఎండగట్టాలని సీఎంను కోరారు. సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా గత వైసీపీ ప్రభుత్వం, అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు పాత్రపై మరింత లోతైన దర్యాప్తు చేయాలని మంత్రులు పేర్కొన్నారు. మరికొంతమంది అధికారుల పాత్రా ఉందని, దీనిపైనా దర్యాప్తు జరపాలని చంద్రబాబుకు మంత్రులు విజ్ఞప్తి చేశారు. 2011లో మహారాష్ట్రలోనూ ఇలానే జరిగితే అక్కడ అభ్యర్థులు పోరాటం చేశారని మంత్రులు గుర్తు చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. సిట్ నివేదిక కోర్టు పరిధిలో ఉందని, న్యాయస్థానం నిర్ణయం ఏమిటో చూద్దామని మంత్రులకు సూచించారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందనే అంశంపై సమాచారం సేకరించేందుకు కొంతమంది పోలీస్ శాఖ అధికారులకు ప్రభుత్వం టాస్క్ ఇచ్చిందన్నారు. తమకు అన్యాయం జరిగిందని కోర్టుకు వెళ్లిన గ్రూప్-1 అభ్యర్థులతో మాట్లాడితే పూర్తి సమాచారం వస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. వారితో వెంటనే మాట్లాడాలని, సమాచారం సేకరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అలాగే, డీఎస్సీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశాన్ని శాసన మండలిలో వైసీపీ లేవనెత్తితే దీటుగా సమాధానం చెబుదామని పేర్కొన్నారు. వైసీపీ చేసే ప్రతి ఆరోపణకు సాక్ష్యాధారాలతో సహా అగ్రెసివ్‌గా కౌంటర్ ఇవ్వాల్సిందేనని మంత్రులకు స్పష్టం చేశారు. పొలిటికల్ ఎటాక్ స్టాం÷-రగ్‌గా ఉండాలన్నారు. కౌన్సిల్‌లో డీఎస్సీపై చర్చకూ సిద్ధమని, ఆరోపణలు చేసే వారు ఆధారాలు తీసుకురావాలని సవాల్ చేయాలని మంత్రులకు సీఎం సూచించారు. ఇప్పటికే అధికారులు అన్ని విషయాలు చెప్పారని, అయినా కావాలని బురద చల్లితే మాత్రం రాజకీయంగా వదిలిపెట్టవద్దని తేల్చి చెప్పారు. రాజధాని అమరావతిలో నిర్మాణాలు ఊపందుకున్నాయని, ఇక వరుసగా ప్రారంభోత్సవాలు చేద్దామని సీఎం చెప్పారు. ఈ సందర్భంగా సైబరాబాద్ నిర్మాణం, హైదరాబాద్ ఓఆర్ఆర్, హైటెక్ సిటీ వంటి ప్రాజెక్టుల్లో తన అనుభవాలను మంత్రులతో సీఎం చంద్రబాబు షేర్ చేసుకున్నారు.ద

# అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు

కామారెడ్డి: అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌కి మద్దతు ఇచ్చానని ఎమ్మెల్యే పోయారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అన్నం పెట్టిన వాళ్లను మరిచిపోతే పుట్టగతులుండవన్నారు. కేసీఆర్ చేశారు కాబట్టే.. చేశారని చెప్పానని.. రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతానని తెలిపారు. ఉన్నది ఉన్నట్లు చెప్పడం తన నైజమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు. దానికి కొనసాగింపుగా గురువారం కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం' అని స్పష్టం చేశారు. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయనని స్పష్టం చేశారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తానన్నారు. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలని.. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేమని పోచారం శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.?

## తెలంగాణను దోచుకోవడంలో బిఆర్‌ఎస్‌తో పోటీ

న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణెళినికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో

భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర

# రాజధానితోనే రాష్ట్రానికి ఆదాయం

అమరావతి: రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని.. ఏపీకి ఆర్థిక రాజధాని కట్టాలని సీఎం చంద్రబాబు భావించారని మంత్రి నారాయణ తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను, బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జిను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణకు వచ్చే ఆదాయం హైదరాబాద్ నుంచే ఎక్కువగా వస్తోందన్నారు. అలాగే మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులకు ముంబాయి, బెంగళూరు, చెన్నైల ద్వారా ఆదాయం వస్తోందని తెలిపారు. ఆర్థిక రాజధాని నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా అందించిందని చెప్పుకొచ్చారు. ఐకానిక్ భవనాల నిర్మాణం కోసం నార్మల్ ఫాస్టర్స్ లండన్ వారిని సంప్రదించినట్లు తెలిపారు. కృష్ణానది ఒడ్డున అమరావతి కడితే అన్ని జిల్లాలకు సమన్యాయం జరుగుతుందని వెల్లడించారు.

అమరావతి.. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు మధ్యలో ఉంటుందని మంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గం అందుబాటులో ఉందన్నారు. 2015 జనవరిలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ ఇచ్చామని.. కేవలం 58 రోజుల్లో ఒక్క లిటిగేషన్ కూడా లేకుండా 34,000 ఎకరాలను రైతులు ఇచ్చారని వివరించారు. అమరావతిలో పనులు ప్రారంభించడం, టెండర్లు పిలవడం, ఇతర పనులు చేపట్టడానికి మూడున్నర సంవత్సరాలు పట్టిందన్నారు. మిగిలిన సంవత్సరం 6 నెలల్లో పదివేల కోట్లు అమరావతి కోసం ఖర్చు చేశామని అన్నారు. గంతలో వైసీపీ అధికారంలోకి వచ్చి మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడిందని మంత్రి విమర్శించారు. అమరావతి నిర్మాణాన్ని ఎక్కడికక్కడ ఆపేసిందన్నారు. నిర్మాణ సంస్థల ఒప్పందాలను క్లోజ్ చేయకుండా వదిలేసిందని.. దీంతో కూటమి ప్రభుత్వం తిరిగి వచ్చాక ఆయా సంస్థలతో ఒప్పందాలను టెక్నికల్‌గా క్లోజ్ చేసి తిరిగి టెండర్లు పిలవాల్సి వచ్చిందని అన్నారు. గతంలో ఉన్న పనుల నాణ్యతను ఐఐటీ చెన్నై, హైదరాబాద్ వారితో పరీక్షింప చేసి పనులను ప్రారంభించామన్నారు. సీడ్ యాక్సిస్ రోడ్‌ను ఆనుకుని ఎలక్ట్రికల్, గ్యాస్, టెలిఫోన్ వాటర్ వంటివి అండర్ గ్రౌండ్‌లో ఉండేలా ప్లాన్ చేశామన్నారు. వైసీపీ ఓ గొడ్డలి పార్టీగా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని.. అయినా రైతులు అమరావతి నిర్మాణానికి సహకరించారని తెలిపారు. ఇలాంటి అమరావతి నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు.

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

కర్నూలు:రాష్ట్రంలో అమలువుతున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'పై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ, చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం చేసి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్రల పాలన సాగుతోందని జగన్ విమర్శించారు. రాత్రి 2:45 గంటల సమయంలో వందల మంది పోలీసులు దొంగల్లా, బందిపోటు ముఠాలా వచ్చి ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటి డోర్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆయనను అపహరించుకుపోయారని ఆరోపించారు. పగటిపూట నోటీసులు ఇస్తే రాని ఉగ్రవాదా ఆయన అని ప్రశ్నించారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా ఈ కేసుల్లో ఇరికించారని మండిపడ్డారు. ఆగష్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగు తుంటే, ఆయన రక్షణ కోసం ఎమ్మెల్యే విరూపాక్షి మానవత్వంతో అక్కడికి వెళ్లడమే నేరమన్నట్లు పోలీసులు వ్యవహరించారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్సై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడక పోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విరగ్గొట్టారని వెల్లడించారు. ఈ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక టీడీపీ కార్యకర్త తన భార్య బట్టలు తానే చించి, ఆ నెపం ఎమ్మెల్యేపై నెట్టి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని, సదరు మహిళతో తప్పుడు మాటలు చెప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, ఈ అక్రమాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు.

# సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళిక




విశాఖపట్నం: ఏనుగుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. విశాఖలో జరిగిన ప్రపంచ ఏనుగుల దినోత్సవం-2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. మానవ-ఏనుగు మధ్య ఘర్షణలు తీవ్రమైన సమస్యగా మారాయన్నారు. దీనికి తాత్కాలిక చర్యలకంటే శాస్త్రీయ పరిశోధన ఆధారిత సమగ్ర ప్రణాళిక అవసరమని తెలిపారు. ఏనుగుల సంరక్షణలో పురోగతి సాధించినప్పటికీ పంట నష్టం, ప్రాణనష్టం, అలాగే ఏనుగుల మృతి వంటి ఘటనలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర ఏనుగు సంరక్షణ ప్రణాళికను రూపొందించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంపొందిస్తూ బందీ ఏనుగుల డీఎన్ఏ డేటాబేస్‌తో పాటు ఏనుగుల కదలికలను పర్యవేక్షించే 'గజ సూచన' యాప్‌ను వినియోగిస్తున్నామని తెలిపారు. ఘర్షణలను తగ్గించడంలో ఏనుగుల ప్రవర్తనపై అధ్యయనానికి ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఏనుగుల మృతిని నివారించేందుకు రైల్వే శాఖతో సమన్వయంగా ప్రమాదకర ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఫెన్సింగ్, హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. విద్యుత్ లైన్ల కారణంగా జరిగే ప్రమాదాలను తగ్గించేందుకు కూడా అవసరమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. సిక్కిం, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో మూడు కొత్త ఏనుగు రిజర్వులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఘర్షణలకు ఒకే విధమైన పరిష్కారం ఉండదని, ప్రాంతాలవారీగా కారణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా ముందస్తు అంచనా ఆధారిత వ్యవస్థ అవసరమని చెప్పుకొచ్చారు. వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సేకరించిన డేటా ఆధారంగా ప్రమాద ప్రాంతాలను గుర్తిస్తున్నామని కేంద్ర మంత్రి అన్నారు. రాష్ట్రాల మధ్య అనుభవాలను పంచుకోవడం ద్వారా మరింత సమర్థవంతమైన పరిష్కారాలు సాధ్యమవుతాయన్నారు. ఏనుగుల సంరక్షణ, ఘర్షణల నివారణ కోసం రూ.500 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధుల ద్వారా శాస్త్రీయ చర్యలను విస్తృత స్థాయిలో అమలు చేయవచ్చన్నారు. ఏనుగులు, ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణ ప్రభుత్వాల బాధ్యత అని, కేంద్ర-రాష్ట్ర సమన్వయంతోనే దీర్ఘకాలిక పరిష్కారాలు సాధ్యమవుతాయని కేంద్ర పర్యావరణ సహాయక శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పేర్కొన్నారు.

## జగన్ పర్యటనలో అడుగడునా ఉల్లంఘనలు

### తీవ్ర ఇబ్బందులకు గురైన వాహనదారులు

కర్నూలు:వైకాపా అధినేత జగన్ కర్నూలు పర్యటనలో అడగడుగునా పోలీసు ఆంక్షలను ఉల్లంఘించారు. అనుమతి లేకపోయినా బళ్లారి చౌరస్తాలో జాతీయ రహదారిపై డీజే పెట్టుకుని బైక్‌లతో స్టంట్స్ చేస్తూ జనానికి చుక్కలు చూపించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కర్నూలు జిల్లా కారాగారంలో ఉన్న ఆలూరు వైకాపా ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శిం చేందుకు జగన్ ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. అనుమతులు లేకపోయినా అక్కడి నుంచి భారీ ర్యాలీతో కర్నూలు బయల్దేరారు. దీంతో పలు వాహనాల రాకపోకలు స్తంభించాయి. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు హెచ్చరించినా.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక
గుంటూరు వార్తలు
శుక్రవారం, 14 ఆగష్టు 2026



## కలెక్టర్ కార్యాలయానికి 'త్రివర్ణ కాంతులు'

**గుంటూరు, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం త్రివర్ణ విద్యుత్ కాంతులతో విరాజిల్లుతుంది. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మువ్వన్నెల రంగులతో దగదగలాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### సమాజం పట్ల బాధ్యత గా ఉండే

# ప్రతి పౌరుడు సైనికుడితో సమానమే

### ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, 13 ఆగస్ట్ 13.2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సమాజం కోసం చిన్న బాధ్యత అయినా, నిర్వర్తించే ప్రతి ఒక్కరూ దేశ సేవలో ఉన్న సైనికుల్లాంటి వారేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వ్యాఖ్యానించారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్ర (బైక్ ర్యాలీ) ఘనంగా జరిగింది. శ్రీనివాసరావుపేటలోని ఎమ్మెల్యే కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ భారీ బైక్ ర్యాలీ చుట్టుగుంట, నగరంపాలెం, ఎత్తురోడ్డు మీదుగా సంపత్ నగర్‌లోని రామనామ క్షేత్రం ఎదురుగా ఉన్న భారతమాత విగ్రహం వద్దకు చేరుకుంది. అక్కడ ఎమ్మెల్యే గళ్ళా మాధవి భారతమాత విగ్రహానికి పూలమాలలు సమర్పించి, ఎన్డీయే కూటమి నేతలతో కలిసి జాతీయ గీతం జనగణమన ఆలపించారు. వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొనడంతో తిరంగా యాత్ర విజయవంతమైంది. ఈతిరంగా యాత్రలో ఎన్డీయే కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు, యువత, మహిళలు, దేశభ్కక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భారతమాతకు జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాలను జరుపుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. ఎన్నో సంక్షోభాలు, యుద్ధాలు, సవాళ్లను అధిగమించి భారతదేశం





నేడు ప్రపంచ పటంలో ఒక ఐకానిక్ దేశంగా నిలవడం వెనుక ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, వీరుల త్యాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. వారి త్యాగఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులను ఆస్వాదిస్తున్నామని తెలిపారు. భారతదేశం ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సి ఉందని, దేశ అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్న సైనికులు, దేశంలో శాంతి భద్రతలను కాపాడు తున్న పోలీసుల స్ఫూర్తిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఒక మొక్క నాటడం నుండి సమాజ అభివృద్ధికి దోహద పడే ప్రతి చర్య దేశభక్తికి నిదర్శనమని చెప్పారు. భావితరం దేశ గౌరవాన్ని మరింత పెంచే విధంగా చైతన్యవంతంగా, బాధ్యతా యుతంగా ముందుకు సాగాలని కోరారు. రానున్న రోజుల్లో భారతదేశం మరెన్నో అద్భుత విజయాలను సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసే గొప్ప సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళు‌న్నామని తెలిపారు. ప్రతి ఇంటికి జాతీయ జెండాను అందించి, దేశభక్తి భావాన్ని మరింత బలపరిచే కార్యక్రమంగా దీనిని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ తిరంగా యాత్రను భారతమాత విగ్రహం వద్ద ముగించి, సమాజ అభివృద్ధి కోసం ప్రతి భారతీయుడు తనవంతు కృషి చేయాలనే ప్రతిజ్ఞ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు, సమాజం, దేశం కోసం సేవా భావంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## బిజెపి ఆధ్వర్యంలో వైభవంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**గుంటూరు, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** భారతీయ జనతా పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 3వ మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా ఆధ్వర్యంలో గురువారం స్థానిక బ్రాడీపేట లోని బండ్లమూడి హనుమాయమ్మ హిందూ మహిళ డిగ్రీ కళాశాల నుండి హర్ ఘర్ తిరంగా ర్యాలీ చాలా వైభవంగా నిర్వహించడం జరిగింది. ముందుగా 75 మీటర్ల భారీ జాతీయ జెండాతో నిర్వహిస్తున్న ఈ ర్యాలీని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, బిజెపి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, ఆర్టీసీ రీవిజనల్ చైర్మన్ సురేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మరియు జిల్లా ఇంచార్జ్ దొరబాబు జాతీయ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ దేశ సమగ్రత మరియు విద్యార్థులకు మరియు యువతకు దేశభక్తుల యొక్క త్యాగాలను మన దేశ మహోన్నతుని తెలియజేసి వారిలో దేశభక్తిని పెంపడానికి మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ హర్ ఘర్ తిరంగా అనే కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా చేపట్టారని దానిలో భాగంగా నేడు బిజెపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గం మూడో మండలం అధ్యక్షురాలు గాయత్రి బెహరా ఆధ్వర్యంలో భారీ తిరంగా యాత్రను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గాయత్రి బెహరా, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరి, బిజెపి లిటరేచర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పాలపాటి రవికుమార్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సాదు రామకృష్ణ, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి హరి పావని, మహిళా మోర్చా జిల్లా కోశాధికారి డాక్టర్ స్రవంతి, మండల ప్రధాన కార్యదర్శి యశ్వంత్ లఖార, మండల ఉపాధ్యక్షులు మల్లికార్జున శర్మగారు, బాల రంగయ్య, జిల్లా యువజన నాయకులు శశాంక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# అధికారం ఉందనే అహంకారంతో బీజేపీ సర్కార్ దాడులు

**గుంటూరు, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** అధికారం ఉందనే అహంకారంతో బీజేపీ సర్కార్ దాడులకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్. రఘువీరారెడ్డి తెలిపారు. సాక్షాత్తు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిలో పాల్గొన్నప్పటికీ పోలీసులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఈమేరకు గుంటూరులో గురువారం రఘువీరారెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశభక్తి అనే మాట ఉచ్చరించే అర్హత బీజేపీకి లేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కనుసన్నల్లోనే అయోధ్య రామమందిరం వివరాల సేకరణలో గోల్



మాల్ జరిగిందని ఆరోపించారు. అలాంటప్పుడు వారికి దైవ భక్తి ఉందని ఎలా చెప్పగలరు అని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే దేశభక్తి, దైవభక్తి ని ఉపయోగించుకుని కాలం గడుపుతున్నారని చెప్పారు. పార్లమెంట్ కి రాని వారికి దేశాన్ని పరిపాలించే అర్హత లేదన్నారు. దేశానికి విముక్తి కలగాన్నా, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించాలన్నా మోడీ హటావో, దేశ్ బచావో తప్పదన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ త్వరలో బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ తోక పట్టుకొని నడిచే పార్టీలు మునిగిపోవడం ఖాయమని స్పష్టం చేశారు.

## అగ్రిగోల్డ్ ఆస్తులు ఆక్రమణకు గురి కాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి



**గుంటూరు, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** అగ్రిగోల్డ్ బాధితులు సమస్యల పరిష్కారం కోరుతూ అగ్రిగోల్డ్ పరిరక్షణ సమితి సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా గుంటూరులో ప్రదర్శన చేపట్టి, కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత సంఘం ప్రతినిధులు కొక్కెర శ్రీనివాస్, శివరామకృష్ణ తదితరులు మీడియాతో మాట్లాడుతూ గత 12 ఏళ్ళుగా అగ్రిగోల్డ్ బాధితులు అల్లాడుతున్నారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం ఇచ్చిన హనుమావెంచర్లో ఉన్న ప్లాట్లను ప్రభుత్వం సీజ్ చేసింది. స్పెషల్ కోర్టు ఏర్పాటు చేసి మా సమస్యలను తీరుస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నిసార్లు సిఐడీ కోర్టు మెట్లెక్కినా బాధితులకు ఇంతవరకు న్యాయం చేయలేదు. వెయ్యి మందికి పైగా అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఫుల్ పేమెంట్ కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్లాట్లను ప్రభుత్వం తీసుకోవటం ఏంటి?. రిజిస్ట్రేషన్ స్థలాల్లో ఇళ్ళుకట్టుకున్న వారికి కోర్టు నుంచి నోటీసులు ఇచ్చారు. అగ్రిగోల్డ్ ఆస్థులను ఈ వేలం వేస్తామని ప్రభుత్వం చెపుతుంది. దాని వలన పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి అన్యాయం జరుగుతుంది. అగ్రిగోల్డ్ కంపెనీ రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్ లు జప్తు రిలీజ్ చేస్తామని గతంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ నేటికీ జప్తు రిలీజ్ చేయలేదని, అమ్ముకునే హక్కు కల్పించడం లేదన్నారు. ఈ ఆక్షన్ పెట్టి రూపాయి ఆస్తి ని పావలా కే కొట్టేస్తున్నారని పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు ఆక్రమణకు గురి కాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. పూర్తిగా డబ్బులు చెల్లించిన వారికి తప్పనిసరిగా ప్లాట్ లు రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరోసారి అగ్రిగోల్డ్ బాధితులు ఆందోళన బాట పట్టడం ఖాయమని హెచ్చరించారు.

## అంగరంగ వైభవంగా ఫుల్ డ్రెస్ రిహార్సల్స్



**గుంటూరు, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** 80వ స్వాతంత్ర దినోత్సవ ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ అమరావతి పెరేడ్ గ్రౌండ్స్ లో గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ బి. రాజకుమారి చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ గా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో గుంటూరు పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ పోలీస్ సమన్వయ అధికారిగా వ్యవహరిస్తున్నారు. పెరేడ్ కమాండర్ గా వైయస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఏ ఎస్పియు విభూకృష్ణ వ్యవ హరిస్తుండగా, పెరేడ్ సెకండ్ ఇన్ కమాండ్ గా 14వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ మహబూబ్ బాషా, పెరేడ్ ఎడ్జెంట్ గా 14వ బెటాలియన్ ఇన్స్పెక్టర్ టి రాఘవేంద్ర వ్యవహరిస్తున్నారు.

## వరిలో సస్య రక్షణ తో ఎల్నీనో ఎదుర్కొందాం

### జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా. చల్లా వెంకట నరసింహ రావు, డా. మానుకొండ శ్రీనివాస్




**జగంపేట, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** జిల్లాలో ప్రస్తుత ఎల్ నీనో పరిస్థితులలో అడపాదడపా వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలకు సార్వా వరి పంటలో చీడపీడలు ఎక్కువ అయ్యే అవకాశం ఉందని, రైతులు తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా. చల్లా వెంకట నరసింహ రావు, డా. మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాజానగరం మండలం పల్లకడియం రైతు సేవా కేంద్రం వద్ద రైతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, ఎల్ నీనో వల్ల వరిలోఆశించే పలు చీడపీడల నివారణకు ఈ క్రింది విధంగా సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకటేశ్వర రావు అధ్యక్షత వహించారు. రాజమండ్రి రూరల్ ఎ డి ఎ జె. శశిబిందు, వ్యవసాయ అధికారి కళ్యాణ్, ఏ ఈ ఓ నాగేశ్వర రావు వి ఏ ఏలు హారిక, నజీనా అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు. డా. మానుకొండ శ్రీనివాస్ వరిలో రకాలు, నీరు, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు విపులంగా వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకటేశ్వర రావు మినుములు వేసుకొనే రైతులకు విత్తనాలు 80 శాతం సబ్సిడీ పై వ్యవసాయ శాఖ ఇస్తుందన్నారు.

# అబ్దుల్ కలాం ఆశయాలతో యువత ముందుకు సాగాలి

**గుంటూరు, 13 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. గురువారం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, కలాం జీవిత చరిత్ర పుస్తకావిష్కరణతో పాటు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అబ్దుల్ కలాం జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకువచ్చి యువతకు అందించడం ద్వారా ఆయన విలువలు, సేవా భావం, దేశభక్తి తదితర అంశాలను కొత్త తరాలకు పరిచయం చేస్తున్నారని తెలిపారు. కలాం పేరుతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలన్న సంకల్పం ఎంతో గొప్పదని కొనియాడారు. గుంటూరులో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై గత ఏడాదికాలంగా ఫౌండేషన్ ప్రతినిధులు కృషి చేస్తున్నారని, ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా అమలు అయ్యేలా తాము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అబ్దుల్ కలాం జీవితం నుంచి తాను ఎక్కువగా నేర్చుకున్న సందేశం "ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి" అన్న సూత్రమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కలలు కనడం, లక్ష్యాలను సాధించడం, నిరంతరం శ్రమించడం వంటి అనేక విలువలను కలాం బోధించినప్పటికీ, వినయం ఆయన జీవితంలో అత్యంత



గొప్ప లక్షణమని అన్నారు. జీవితంలో ఎదుగుదలకు అంతం ఉండదని, ఒక లక్ష్యం చేరుకున్నాక మరో లక్ష్యం ఎదురుచూస్తూ ఉంటుందని చెప్పారు. సమాజానికి సేవ చేసే అవకాశాలు ఎప్పటికీ ముగియవని, కలాం చివరి శ్వాస వరకు దేశం కోసం ఆలోచించి పని చేసిన మహనీయుడని గుర్తు చేశారు. యువతనే దేశ భవిష్యత్తుకు ప్రతిరూపమని, వారి ఆలోచనలే భారతదేశ ఆలోచనలుగా మారుతాయని తెలిపారు. అందుకే యువత మంచి ఆలోచనలతో, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. పేదరికం, కులం, మతం, పరిస్థితులు ఏవీ విజయానికి అడ్డంకులు కావని, సంకల్పం మరియు కృషి మాత్రమే విజయానికి అసలైన మూలమని కలాం జీవితం నిరూపించిందన్నారు. నేటి యువతకు అపార అవకాశాలు ఉన్నప్పటికీ, సామాజిక మాధ్యమాల ప్రభావంతో కొంతమంది తమ సామర్థ్యాలను పరిమితం చేసుకుంటున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. సోషల్ మీడియా అనే బంధనంలో చిక్కుకోకుండా, స్వేచ్ఛగా ఆలోచిస్తూ, తమ ప్రతిభకు రంగులు అద్దుకుని జీవితంలో ఎగరాలని యువతకు సూచించారు. ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం జీవిత చరిత్రను తప్పనిసరిగా చదవాలని కోరిన ఎమ్మెల్యే, ఆ పుస్తకం యువతలో స్ఫూర్తిని నింపి సమాజానికి సేవ చేయాలనే తపనను పెంచుతుందని అన్నారు. పుస్తకం చదివిన ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో సమాజానికి ఏదో ఒక విధంగా ఉపయోగపడతారని తనకు నమ్మకం ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం నేడు అత్యంత వేగంగా ఎదుగుతున్న దేశాలలో ఒకటిగా నిలిచిందని, సామాజిక మాధ్యమాల్లో కనిపించే ప్రతికూల ప్రచారాన్ని మాత్రమే నమ్మకుండా దేశం సాధించిన విజయాలను కూడా యువత తెలుసుకోవాలని సూచించారు. ఇతర దేశాల్లోని మంచి విధానాలను అధ్యయనం చేసి భారతదేశంలో అమలు చేసే దిశగా ఆలోచించాలే గానీ, విదేశాలపై మోజు పెంచుకోవద్దని హితవు పలికారు. తాము కూడా అబ్దుల్ కలాం వంటి మహనీయుల కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వ సహకారంతో అన్ని విధాలుగా కృషి చేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, మహనీయుల ఆశయాలను అభిమానించే వ్యక్తిగా ఈ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు అందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యావేత్తలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి

### ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం



**ఎన్.టి.ఆర్ జిల్లా, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని,హెల్మెట్ పెడితే పెట్టుకోవడంతో పాటు క్లిప్ కూడా పెట్టుకోవాలని వాహన దారులకు ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ సూచించారు. ఇబ్రహీంపట్నం లోని రింగ్ సెంటర్ వద్ద వాహనదారులకు హెల్మెట్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ మాత్రమే ధరించడం కాకుండా, దానికి ఉన్న క్లిప్ ను కూడా పెట్టుకోవాలని తెలిపారు. దాని వలన మనం వాహనంపై ప్రయాణించేటప్పుడు అనుకో కుండా వాహనం పై నుండి కింద పడిపోతే హెల్మెట్ జారిపోకుండా ఉండి, మనకు ప్రమాదం జరగకుండా ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ తోపాటు ట్రాఫిక్ సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

# భావపురి మాజీ సైనికులకు దక్కిన అరుదైన గౌరవం

### దేశ సేవ చేసిన వీరులకు ఘన సన్మానం

**బాపట్ల, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి, దేశ భద్రతకు అంకితమైన మాజీ సైనికులకు 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అరుదైన గౌరవం దక్కనుంది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులోని లీగల్ ఎడ్యుకేషన్ అండ్ యాక్షన్ ఫర్ రూరల్ పూర్ సంస్థ కార్యాలయంలో మాజీ సైనికులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సంస్థ ప్రెసిడెంట్, డైరెక్టర్, ప్రముఖ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయవాది టి.జి.జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దేశ రక్షణలో సైనికులు చేసిన సేవలను గుర్తించడంతో పాటు, సైన్యంలో సేవలందించి ప్రస్తుతం మాజీ సైనికులుగా ఉన్న వారిని గౌరవించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

**భావపురి మాజీ సైనికులకు ప్రత్యేక ఆహ్వానం**

ఈ ప్రత్యేక సన్మాన కార్యక్రమానికి బాపట్ల భావపురి మాజీ సైనికుల సంక్షేమ సంఘం తరపున కాగిత మాణిక్యరావు, జెట్టి జోసఫ్, షేక్ కాలేషా, కొలసాని వేణుగోపాల్, మరకా వసంతరావు, షేక్ అఖిల్, వంశీకృష్ణ వెలిచర్లను ప్రత్యేకంగా ఆహ్వానించారు. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ ప్రతికూల పరిస్థితులను సైతం ఎదుర్కొని దేశ ప్రజల భద్రత కోసం సైనికులు అందించిన సేవలు చిరస్మరణీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ దేశం కోసం చేసిన త్యాగాలు, క్రమశిక్షణ, ధైర్యసాహసాలు దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

**యువతకు స్ఫూర్తిగా సైనికుల సేవలు**

సైనికుల సేవలను స్మరించుకోవడం ద్వారా యువతలో దేశ భక్తి, జాతీయ స్ఫూర్తి పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. దేశం కోసం సేవ చేసిన మాజీ సైనికులను గౌరవించడం సమాజం బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సన్మాన కార్యక్రమం ద్వారా మాజీ సైనికుల సేవలను మరోసారి ప్రజలకు గుర్తుచేయడంతో పాటు, వారిత్యాగాలకు సముచిత గౌరవం లభిస్తుందని తెలిపారు. బాపట్ల భావపురి మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులకు గుంటూరులో జరిగే ప్రత్యేక సన్మాన కార్యక్రమానికి ఆహ్వానం అందడం పట్ల మాజీ సైనికుల కుటుంబాలు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతానికి చెందిన మాజీ సైనికులను జాతీయ పర్వదినం సందర్భంగా సత్కరించడం గర్వకారణమని పేర్కొన్నారు. దేశ రక్షణకు తమ వంతు సేవ చేసిన మాజీ సైనికులను సన్మానించి, వారి సేవలను గౌరవించే ఈ కార్యక్రమం స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# ఏపీడబ్ల్యూజేఎస్ రాష్ట్ర కమిటీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా యర్రంశెట్టి వేణుగోపాలరావు



**చెరుకుపల్లి, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు సమైక్య రాష్ట్ర కమిటీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా భట్టిప్రోలుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎర్రంశెట్టి వేణు గోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీడబ్ల్యూజేఎస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఏపీడబ్ల్యూజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చల్లగుండ్ల రామకృష్ణ చౌదరి ప్రతిపాదించారు. అనంతరం వేణుగోపాల్ మాట్లాడుతూ జర్నలిస్టులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతూ జర్నలిస్టుకు అందుబాటులో ఉంటానని యూనియన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఏపీడబ్ల్యూజేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన వేణుగోపాల్‌ను గురువారం బాపట్ల జిల్లా ఏపీడబ్ల్యుజే ఎస్ అధ్యక్షులు కూరేటి శ్రీనివాసరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏపీడబ్ల్యూజే సభ్యులు పాల్గొన్నారు.

# వలసపాకలలో 'ఇంటింటికి తెలుగుదేశం'కు అపూర్వ స్పందన

### జాతీయ జెండాతో వాకలపూడి నుంచి సర్పవరం జంక్షన్ వరకు 'తిరంగా యాత్ర' వలసపాకలలో 'పిల్లి' దంపతులకు ఘన స్వాగతం.. గజమాలలు, హారతులు, బాణాసంచాతో అభిమానుల సందడి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి ఇంటింటికీ వెళ్లిన 'పిల్లి' దంపతులు ఇద్దరు లబ్ధిదారులకు రూ.2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**కాకినాడ బ్యూరో, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** జాతీయ జెండాను చేతబట్టి దేశభక్తి నినాదాలతో సాగిన 'తిరంగా యాత్ర', అనంతరం ప్రజలతో మమేకమైన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంతో వాకలపూడి, వలసపాకల ప్రాంతాల్లో సందడి నెలకొంది. టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లిఅనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు తొలుత వాకలపూడి గ్రామంలో జాతీయ జెండాలను చేతబట్టి నడుస్తూ తిరంగా యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి వలసపాకల మీదుగా సర్పవరం జంక్షన్ వరకు కారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వలసపాకల గ్రామంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోకి పిల్లి దంపతులు చేరుకున్న సందర్భంగా ప్రజలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, గజమాలలు వేసి, హారతులు ఇచ్చి, బాణాసంచా కాల్చుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. పిల్లి దంపతులు కూడా ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.



**ప్రజలతో మమేకం**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకువివరించారు. సూపర్-6హామీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు ప్రోత్సాహం, సామాజిక భద్రతా పథకాలతో పాటు వివిధ వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.అనంతరం పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం కార్యక్రమంలో పాల్గొని పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ, ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి చేరుతున్న తీరును తెలుసుకోవడం 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నాయకులు, పార్టీ శ్రేణులు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు.



**ఇద్దరికి రూ.2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్**

కార్యక్రమంలో భాగంగా ఇద్దరు లబ్ధిదారులకు మొత్తం రూ.2.50 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం కలిసి అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తోందని వారు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, ప్రజలే తమ బలం, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకోవడం ద్వారా వారి అవసరాలను నేరుగా తెలుసుకునే అవకాశం కలుగుతోందన్నారు. ప్రజలు తమపై చూపిస్తున్న అభిమానం, ఆత్మీయతకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా నిరంతరం పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కేశబోయిన ఏడుకొండలు, క్లస్టర్ కన్వీనర్ తాతపూడి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు వాసంశెట్టి, మాజీ పిఏసి చైర్మన్ కొల్లిబోయిన సూరిబాబు, పడమటి వీరబాబు, దేవత రామచల్మాజీ, అచ్యుత్, శ్రీను, వర్మ సత్యనారాయణ స్థానిక కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, మహిళలు, యువత, గ్రామ పెద్దలు, వలసపాకల గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరు గ్రామాలను విలీనం చేసి కాకినాడ కార్పోరేషన్ ఎన్నికలు జరపాలి

### సిపిఎం పార్టీ డిమాండ్

**కాకినాడ బ్యూరో, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధిని న్యూస్ :** ఇదివరకటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయం మేరకు కాకినాడ రూరల్ మండలంలోని తూరంగి,ఇంద్రపాలెం,చీడిగ, వలస పాకల, వాకలపూడి, రమణయ్యపేట గ్రామాలను కాకినాడ కార్పొరేషన్ లో విలీనం చేసి, డివిజన్లు పెంచి ఎన్నికలు నిర్వహించాలని, దానికి తగిన గెజిట్ నోటిఫికేషన్ ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ సిపిఎం రూరల్ మండల కమిటి కోరుతున్నది. ఈ మేరకు పార్టీ పార్టీ ప్రతినిధి బృందం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూరల్ పార్టీ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 15సంవత్సరాలుగా పాలకవర్గాలులేక ఈ గ్రామాల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం చేయబడుతున్నదని, నిధుల కొరతతో అభివృద్ధి జరగడం లేదన్నారు. ఈ గ్రామాలను కార్పొరేషన్ లో విలీనం చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) కలిసి ఉద్యమాలు చేయడాన్ని, కాకినాడ రూరల్ శాసన సభ్యులు అయిన తర్వాత ఈ గ్రామాల విలీన అంశాన్ని శాసనసభలో ప్రస్తావించినవిషయాన్ని నాగేశ్వరరావు గుర్తు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామాల విలీన అంశాన్ని ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 24-03-2026 న విడుదల చేసిన జీవో నెంబర్ 65 ప్రకారం జనాభా ప్రాతిపదికన కాకినాడ కార్పొరేషన్ జనాభా, ఆరు విలీన గ్రామాల జనాభా (ఐదు లక్షల లోపు) తో కలిపితే 68 డివిజన్లుగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని వారు గుర్తు చేశారు. సెప్టెంబర్ 3న ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా విడుదల చేస్తున్నది కాబట్టి, ఆరు విలీన గ్రామాల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆగస్టు నెల లోనే పూర్తి చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నదని వారు అన్నారు. అనంతరం టీడీపీ నాయకులు పిల్లి సత్యనారాయణ మూర్తితో పార్టీ బృందం ఈ విషయాన్ని చర్చిందింది. ప్రతినిధి బృందంలో పార్టీ రూరల్ కమిటీ సభ్యులు పెద్దింశెట్టి రామకృష్ణ, చింతపల్లి అజయ్ కుమార్, తొట్టిపూడి రాజా, సూర్యం, సీనియర్ నాయకులు వాసంశెట్టి చంద్రరావు, జుత్తుగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





# మరణంలోను వెలుగు చూపడమే అవయవదానం : ఎస్పీ జి.బిందుమాధవ్

**కాకినాడ బ్యూరో, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ మరణంలోను మరొకరికి వెలుగు చూపడమే అవయవదానం అని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవయవ దాన దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థుల సహకారంతో అవగాహన ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ఎస్పీ కార్యాలయం నుండి భానుగుడి కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అవయవ దానం సమయంలో పోలీసుశాఖగ్రీన్‌ఛానల్ ఏర్పాటుచేసి సహాయపడుతుందని అన్నారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహిస్తున్న మెడికవర్ హాస్పిటల్ యాజమాన్య ప్రతి నిధులను అభినందించారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె. అనిత మాట్లా డుతూ "ప్రతి సంవత్సరం ఆగస్టు 13న ప్రపంచ అవయవ దాన దినోత్సవం జరుపుకుంటారని, అవయవ దానం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, అవయవ లోపంతో బాధపడుతున్న రోగులకు కొత్త జీవితాన్ని ఇవ్వడం మరియు అవయవ దాతలుగా నమోదు చేసుకోవడానికి ప్రజలను ప్రోత్సహించడం ఈ రోజు లక్ష్యం అని అన్నారు. ప్రమాదాల్లో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి లేదా మరణించిన వారి అవయవాల ద్వారా 8మంది కి కొత్త జీవితాన్ని ఇవ్వవచ్చని, గుండె, కాలేయం, మూత్ర పిండాలు, ఊపిరితిత్తులు, క్లోమం, కణజాలాలు, కంటి కార్నియా, చర్మం, ఎముకలు, గుండె కవాటాలు దానం చేయదగిన అవయవాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ప్రతిజ్ఞ చేయవచ్చని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 'జీవన్ దాన్' వంటి కార్యక్రమాల ద్వారా అవయవ మార్పిడి ప్రక్రియను క్రమబద్ధీకరిస్తున్నారని, "మరణంలోనూమరొకరికి వెలుగుచూపడమే అవయవ దానం" యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించి,అవయవ దానానికి ముందుకొచ్చేలా ప్రతిఒక్కరిలో చైతన్యం నింపాలనికోరారు. మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ నందికోళ్ల అంజిబాబు మాట్లాడుతూ అవయవ దానం పట్ల అవగాహన కల్పించేందుకు ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టామని, ఇందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ట్రాఫిక్-2సీఐ రామారావు తన సిబ్బంది తో ట్రాఫిక్ నియంత్రణ చేసిసహకరించారు. ఈకార్యక్రమంలో యూరాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ బాబు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజా అమరేంద్ర, ఎనస్తీషియా డాక్టర్.కిషోర్ బాబు, క్రిటికల్ కేర్ డాక్టర్ అరవింద్, లయన్స్ క్లబ్ స్వయంకృషివైస్ ప్రెసిడెంట్ వినితా రెడ్డి, కోశాధికారి సురేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఎలైట్ ఎమ్. సత్య నారాయణ, లయన్స్ క్లబ్ శ్రీకారం 2వ వైస్ ప్రెసి డెంట్ మెట్టా రాధా సరస్వతి, రీజనల్ చైర్పర్సన్ కె ఉమాదేవి, నందూరి సుకుమార్, హాస్పిటల్ సిబ్బంది, ఆదిత్య నర్సింగ్, ఆదిత్య మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




# దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలి






**రేపల్లె, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరకు 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహణలో బాగంగా దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం చేసే లక్ష్యంతో మన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనే నేను కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలన్న అంశంపై నిర్వహించే సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ హైవే లోని "వై" జంక్షన్ నుండి రాజలక్ష్మి తీయేటర్ సర్కిల్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు 80వ స్వతంత్ర దినోత్సవం వేడుకలలో విధిగా పాల్గొని దేశభక్తిని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బి.శ్రీదేవి,మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, జిల్లా బి సి సంక్షేమ సాధికార అధికారిణి శివలీలా, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్, పాఠశాలల బాల, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు విందు భోజనం యువతకు డ్రైవింగ్ లైసెన్స్ పంపిణీ

### 19వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఇంజరపు దుర్గ మేరీ దంపతులు





**జగ్గంపేట, 13 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేట, ఆగస్టు 13: మల్లిసాల గ్రామానికి చెందిన ఇంజరపు దుర్గబాబు, మేరీ దంపతుల 19వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా జగ్గం పేట భవిత దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లిసాల గ్రామ యువకులకు డ్రైవింగ్ లైసెన్స్ పంపిణీ కూడా చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని సొంత ఖర్చులతో నిర్వహించారు. ఎస్ఏ గఫూర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ, వక్ఫ్ బోర్డు అధ్యక్షులు మాట్లాడుతూ, దుర్గబాబు కుటుంబం పెళ్లిరోజు, పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అలవాటుగా మారిందన్నారు. గతంలో తాళ్లూరు జి.అయ్యన్న ఆలయానికి మైక్ సెట్, ఇన్వర్టర్, భవిత స్కూల్ కు కంప్యూటర్ అంద జేసినట్లు తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు భోజన ఏర్పాట్లు, యువతకు లైసెన్స్ పంపిణీ వంటి కార్యక్ర మాలు అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సూచన మేరకు డ్రైవింగ్ నేర్చుకునే వారందరికీ లైసెన్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

## అంగరంగ వైభవంగా కన్నాలక్ష్మి నారాయణ

# రాజకీయ స్వర్ణోత్సవ సంబరాలు











జన్మదిన సందర్బంగా సర్వమత ప్రార్థనలు నిర్వహించిన నాయకులు కార్యకర్తలు

రాష్ట్ర మరియు నియోజకవర్గ నలుమూలల నుంచి పాల్గొన నాయకులు, కార్యకర్తలు

జన్మదిన సందర్భంగా అభిమానులు ఉదయం నుంచి సాయంత్రం వరకు టపాసులు పేల్చిన వైనం

పదవులు కాదు.. ప్రజల విశ్వాసమే ఎమ్మెల్యే కన్నా సంపాదించుకున్న అసలైన ఆస్తి

నియోజకవర్గాలు మారాయి.. కాలం మారింది.. కానీ కన్నాపై ప్రజల అభిమానం మారలేదు..

యువ రాజకీయ నాయకత్వానికి కన్నా లక్ష్మీనారాయణ జీవితం ఒక స్ఫూర్తి

ఐదు దశాబ్దాల ప్రజాజీవితమే అతిపెద్ద రాజకీయ విశ్వవిద్యాలయం

తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మాజీ మంత్రివర్యులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన సందర్భంగా గుంటూరు శ్రీ కన్వెన్షన్ నందు ఏర్పాటు చేసిన భారీ కేక్ ను నియోజకవర్గ నాయకులు, ప్రజల కేరింత ల మధ్య కట్ చేసి, తినిపించారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఐదు దశాబ్దాల పాటు ప్రజల మధ్యే ఉంటూ వారి విశ్వాసాన్ని, అభిమానాన్ని నిలబెట్టుకోవడం సాధారణ విషయం కాదని, సీనియర్ నాయకుడు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ జీవితం నేటి యువ నాయకత్వానికి ఒక స్ఫూర్తిదాయక పాఠమని గుంటూరులో కన్నా లక్ష్మీనారాయణ గారి 50 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం – రాజకీయ స్వర్ణోత్సవ సంబరాల్లో కూటమి పార్టీల తరఫున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానం అంటే సాధారణ విషయం కాదు. ఒక ఎన్నిక గెలవడం గొప్ప విషయం కావచ్చు. కానీ ఐదు దశాబ్దాల పాటు ప్రజల మధ్య ఉండి, వారి విశ్వాసాన్ని, అభిమానాన్ని నిలబెట్టుకోవడం అసాధారణమైన విషయం. విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన కన్నా లక్ష్మీనారాయణ ప్రయాణం గుంటూరు జిల్లా యూత్ అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఎన్నో కీలక బాధ్యతలు నిర్వర్తించే స్థాయికి ఎదిగింది" అని కొనియాడారు.

1989, 1994, 1999, 2004లో పెదకూరపాడు నుంచి, 2009లో గుంటూరు వెస్ట్ నుంచి, 2024లో సత్తెనపల్లి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం కన్నా లక్ష్మీనారాయణపై ప్రజలకు ఉన్న అపారమైన నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. 'నియోజకవర్గాలు మారాయి.. కాలం మారింది.. రాజకీయ పరిస్థితులు మారాయి.. కానీ కన్నాపై ప్రజల అభిమానం మాత్రం మారలేదు. అదే ఆయన నిజమైన రాజకీయ బలం అని అచ్చెన్నాయుడు అన్నారు. మంత్రిగా పరిశ్రమలు, వాణిజ్యం, ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్, గృహ నిర్మాణం, వ్యవసాయం వంటి కీలక శాఖలను నిర్వహించి కన్నా లక్ష్మీనారాయణ తనదైన ముద్ర వేశారని తెలిపారు. 2018--2020 మధ్య రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కూడా పార్టీకి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. రాజకీయాల్లో ఎన్నో పదవులు నిర్వహించినప్పటికీ ప్రజలతో ఉన్న ఆత్మీయ అనుబంధమే కన్నా లక్ష్మీనారాయణను ప్రత్యేకమైన నాయకుడిగా నిలబెట్టిందన్నారు.



"కన్నా రాజకీయ జీవితాన్ని చూస్తే ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. రాజకీయమంటే పదవి కాదు.. బాధ్యత. రాజకీయమంటే అధికారం కాదు.. ప్రజాసేవ. రాజకీయమంటే ఐదేళ్ల ప్రయాణం కాదు.. జీవితకాల నిబద్ధత. ఆయన సంపాదించుకున్న అసలైన ఆస్తి పదవులు కాదు... ప్రజల విశ్వాసం, కార్యకర్తల అభిమానం, ప్రజలతో ఏర్పడిన ఆత్మీయ బంధం" అని పేర్కొన్నారు. కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ స్వర్ణోత్సవం ఒక వ్యక్తికి సంబంధించిన వేడుక మాత్రమే కాదని, ప్రజాజీవితంలోకి రావాలనుకునే ప్రతి యువ నాయకుడికి ఆయన ప్రస్థానం ఒక స్ఫూర్తి అని అన్నారు. "ఐదు దశాబ్దాల ప్రజాజీవితమే అతిపెద్ద రాజకీయ విశ్వవిద్యాలయం. కన్నా గారూ.. మీరు 50 ఏళ్ల రాజకీయ మైలురాయిని చేరుకున్నారు. కానీ ఇది ముగింపు కాదు... మరో కొత్త అధ్యాయానికి ప్రారంభం కావాలి. మీ అనుభవం రాష్ట్రానికి, మీ రాజకీయ పరిజ్ఞానం యువ నాయకత్వానికి మరింత ఉపయోగపడాలి" అని ఆకాంక్షించారు. కన్నా లక్ష్మీనారాయణ గారు నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండి, మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. "జన నాయకుడు కన్నా 50 ఏళ్ల రాజకీయ స్వర్ణోత్సవ ప్రస్థానానికి హృదయపూర్వక అభినందనలు. ఆయన ప్రజాసేవా ప్రస్థానం చిరస్థాయిగా కొనసాగాలి" అంటూ మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక్కసారి గెలవడమే కష్టంగా ఉన్న రోజుల్లో ఆరు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడం అంత సులభం కాదని ఏపి శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. ఆరుసార్లు గెలుపొందిన కన్నా జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాజకీయాల్లో యాభై ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు పాల్గొన్నారు.

1973లో ఎన్ ఎస్ యు ఐ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా రాజకీయ ప్రస్థానాన్ని కన్నా లక్ష్మీ నారాయణ ప్రారంభించారు. రాజకీయాల్లోకి వచ్చి యాభై ఏళ్లైన సందర్భంగా కన్నా అభిమానులు, అనుచరులు గుంటూరు శ్రీ కన్వెన్షన్ సెంటర్ లో భారీ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపిలు, ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. సినీ నటుడు బ్రహ్మానందాన్ని ఈ సందర్భంగా సన్మానించారు. నా స్వంత నియోజకవర్గమైన సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా అని ఆయన పుట్టిన రోజు కూడా కావడంతో ఈ రోజు సభలో పాల్గొనడం సంతోషంగా ఉందని బ్రహ్మానందం అన్నారు. టిడిపి, బిజెపి, జనసేన నేతలు ఈ సభలో పాల్గొన్ని కన్నా సేవలను కొనియాడారు. ప్రతి ఊరిలోనూ స్వంత వర్గం ఉన్న నేతగా కన్నాకు పేరుందని డిప్యూటీ స్పీకర్ రఘురామక్రిష్ణం రాజు అన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానం మరిన్ని దశబ్దాలు వెలుగొందాలన్నారు. ఏ శాఖ మంత్రిగా పనిచేసినా ప్రజలకు ఆయన సేవలందించారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జగన్ కు వ్యతిరేకంగా కూటమీ ఏర్పాటు చేయడంతో ఆయన పాత్ర కూడా ఉందన్నారు. రాష్ట్ర విభజన జరగకుండా ఉంటే కన్నా లక్ష్మీ నారాయణను ముఖ్యమంత్రిగా చూసేవాళ్లమని మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. ఏ బాధ్యత అప్పగించిన దాన్ని పూర్తి చేసే వరకూ అవిశ్రాంతంగా కష్టపడటం కన్నా లక్షణమని ఎంపి పురందేశ్వరి అన్నారు. ఈ సభకు వివిధ నియోజకవర్గాలు, జిల్లాల నుండి అభిమానులు, అనుచరులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.




























# పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు!

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.....పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవామానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికీ సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్ధంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బలంగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృధా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.





# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**ఎలాంటి చర్చలు లేకుండానే ముగిసిన పార్లమెంటు సమావేశాలు**

**నీట్ లీక్, అయోధ్య విరాళాల చోరీ, విద్యార్థుల మీద లాఠీ-చార్జీపై రచ్చ**

**లోక్సభ షెడ్యూల్ సమయంలో 15 శాతమే సద్వినియోగం**

**రాజ్యసభ సమయంలో 39 శాతం చర్చలు**

**సభా సమయం వృథాపై బీజేపీ, కాంగ్రెస్ మాటల యుద్ధం**

**వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా**



**న్యూఢిల్లీ :** అరుపులు.. కేకలు.. నినా దాలు.. వాయిదాలతో ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు. అవే నినాదాలతో గురు వారం నిష్ఫలంగా ముగిశాయి. గత నెల 20న ప్రారంభమైన సమావేశాల్లో ఏ ఒక్కరోజూ పూర్తి సమయం చర్చ జరగలేదు. నీట్ పరీక్ష పేపర్ లీక్, అయోధ్య రామాలయంలో కానుకల చోరీ, ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీ, పెల్లెట్ల 1 ప్రయోగం, ఈ20 పెట్రోల్ తదితర అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్షాలు పట్టు బట్టడంతో ఉభయ సభల కార్యకలాపాలు స్తంభిం చిపోయాయి. ముఖ్యంగా లోక్సభను విపక్షాలు దాదాపు పూర్తిగా స్తంబింపజేశాయి. ఈ సెషన్లో లోక్సభలో చర్చకు నిర్దేశించిన సమయంలో 15 శాతమే సద్వినియోగం అయ్యింది. మొత్తం ప్రశ్నో త్తరాల సమయంలో 1 శాతం మాత్రమే సద్విని యోగం అయ్యింది. అంటే మొత్తంగా 9 నిమిషాలు మాత్రమే చర్చ జరిగింది. రాజ్యసభ సమయం 39 శాతం సద్వినియోగం అయ్యింది. సభ స్తంభించిన ప్పటికీ లోక్సభ ఎలాంటి చర్చ లేకుండానే 10 బిల్లులను ఆమోదించింది. పరీక్ష పేపర్ల లీక్ నిరో ధక బిల్లుపై మాత్రమే 10 గంటలపాటు చర్చ జరి గింది. వందేమాతర గీతాన్ని అవమానించేవారిని శిక్షించేందుకు ఉద్దేశించిన జాతీయ గౌరవ అవ మాన నిరోధక బిల్లు-2026పై ఇద్దరు సభ్యులు మాట్లాడారు. బిల్లు కొద్ది నిమిషాల చర్చతో ఆమోదం పొందింది. మొత్తంగా లోక్సభ ఈ సెష న్లో 12 బిల్లును ఆమోదించింది. మహిళా రిజర్వే షన్లు, డీలిమిటేషన్, విదేశీ విరాళాల నియంత్రణ బిల్లులను ఈ సెషన్లో ఆమోదింపజేసుకోలేకపో యింది. విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లుపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు తెలపటంతో ప్రభుత్వం దానిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపింది. 18 రోజులతర్వాత కేంద్ర మంత్రి అమిత్ షా గురువారం లోక్సభకు హాజరయ్యారు. ఆయన సభలోకి అడుగు పెట్టిన 4 నిమిషాలకే సభను స్పీకర్ నిర వధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. స్పీకర్ ప్రసంగం లేకుండానే సభ వాయిదా పడటం గమనార్హం. చివరిరోజు కూడా సభప్రారంభం కాగానే విపక్ష సభ్యులు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ సభను అడ్డుకున్నారు. సభా సమయం వృథా కావటంపై రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆవేదన వ్యక్తంచేశారు.

### తొలిసారి వందేమాతరంతో..

భారత పార్లమెంటు చరిత్రలో తొలిసారి లోక్సభ సమావేశాలు వందేమాతరం గీతాలా పనతో ప్రారంభమయ్యాయి. వందేమాతర గీతానికి చట్టపరమైన రక్షణ కల్పిస్తున్న జాతీయ గౌరవ అవమాన నిరోధక బిల్లు-2026కు రాష్ట్రపతి బుధవారం ఆమోదం తెలపటంతో అది చట్టంగా మారింది. ఆ మరు సటి రోజే సభలో గీతం పూర్తిగా ఆరు చరణా లను వినిపించారు. ఆ సమయంలో ప్రధాని, మంత్రులు, విపక్ష నేత సహా సభ్యులంతా సభకు హాజరయ్యారు. సమావేశాలు చర్చ లేకుండానే ముగియటంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాట యుద్ధం నడిచింది. ఈ పరిస్థితికి విపక్ష నేత రాహుల్గాంధీయే కారణమని మంత్రులు రిజిజు, ప్రహ్లాద్ జోషి ఆరోపిం చారు. ఆయన అహంకారం వల్లే సభా సమయం వృథా అయ్యిందని విమర్శించారు. బీజేపీ విమర్శలను కాంగ్రెస్ తిప్పికొట్టింది. కీల కమైన అంశాలపై చర్చకు రాకుండా ప్రభుత్వం పారిపోయిందని ఆ పార్టీ నేత జైరాంరమేశ్ విమర్శించారు.

# ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

## ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్ట్13 :** ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. అల్‌ఖైదా తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు పాక్ అండ

## పాక్‌వైపు కన్నెత్తితో భారత్ సర్వనాశనం తప్పదు

## అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రేలాపన

**న్యూఢిల్లీ,ఆగస్ట్13 :** పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హాఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

## ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే

## మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం.. కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు



**న్యూఢిల్లీ,ఆగస్ట్13 :** అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# చంద్రగిరిలో ఏనుగుల హల్‌చల్

## పంటపొలాలను ధ్వంసం చేసినట్లు రైతుల వెల్లడి

**తిరుపతి,ఆగస్ట్13 :** జిల్లాలోని చంద్రగిరి మండలం యల్లంపల్లిలో మరోసారి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి గ్రామ పరిసరాల్లోకి సుమారు 15 ఏనుగులు చొరబడి పంట పొలాలపై దాడి చేశాయి. వరి పంటతో పాటు పశువుల కోసం సాగు చేసిన గడ్డి పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. రైతులకు చెందిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాత్రివేళ ఏనుగుల గుంపు ఒక్కసారిగా పంట పొలాల్లోకి రావడంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగుల దాడితో నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు మళ్లీ గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండటంతో యల్లంపల్లి ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఏనుగులు ఎప్పుడు, ఎటువైపు నుంచి వస్తాయో తెలియక రైతులు రాత్రివేళ పొలాల వద్దకు వెళ్లేందుకు సైతం భయపడుతున్నారు. పంట నష్టానికి పరిహారం అందించడంతో పాటు ఏనుగులు గ్రామాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామస్తుల సమాచారంతో అటవీ అధికారులు రంగంలోకి దిగి ఏనుగుల కదలికలను పరిశీలిస్తున్నారు. ఏనుగుల గుంపును సురక్షితంగా అటవీ ప్రాంతం వైపు తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# టీమిండియా వైఫల్యాలు

## గంభీర్ కోచింగ్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం!



టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ పదవికి వచ్చిన ముప్పేమీ లేదని, అతడు ప్రస్తుతానికి సురక్షితంగానే ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో జట్టు వైఫల్యాలు, అంతకుముందు స్వదేశంలో టెస్టు సిరీస్‌లలో ఎదురైన పరాజయాలతో గంభీర్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అయినప్పటికీ బీసీసీఐ గౌతీకి అండగా నిలుస్తున్నట్లు సమాచారం. గంభీర్‌ను కోచ్ పదవి నుంచి తొలగించకపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. గతంలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్లతో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లలో టీమిండియా ఘోర పరాజయాలు చవిచూసింది. దీనికి తోడు ఇటీవల పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఈ నేపథ్యంలో 2027 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించడం భారత్‌కు కష్టతరంగా మారింది. దీంతో సోషల్ మీడియాలో గంభీర్‌ను తొలగించాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. అయితే, బోర్డు వర్గాలు మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నట్లు స్పష్టమవుతోంది. టెస్టు జట్టు ప్రస్తుతం ఒక పరివర్తన దశలో ఉందని బీసీసీఐ భావించడమే ఇందుకు మొదటి కారణం. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ వంటి దిగ్గజాలు టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో యువ జట్టు నిర్మితమవుతోంది. ఈ మార్పులకు కొంత సమయం పడుతుందని బోర్డు అంగీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక రెండో కారణంగా.. కీలక ఆటగాళ్ల గాయాల సమస్యను కూడా బీసీసీఐ పరిగణనలోకి తీసుకుంటోంది. దక్షిణాఫ్రికాతో సిరీస్ మధ్యలో గిల్ గాయపడకుండా ఉండుంటే ఫలితం మరోలా ఉండేదని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం శ్రీలంక పర్యటనకు కూడా పేస్ గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ వంటి కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా దూరమయ్యారు. మరోవైపు, బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE) హెడ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ తన పాత్రలో సంతృప్తిగా ఉన్నాడు. శ్రీలంక పర్యటన తర్వాత డబ్ల్యూటీసీ సైకిల్‌లో కేవలం రెండు సిరీస్‌లే మిగిలి ఉండటంతో తాత్కాలిక కోచ్ నియామకంపై బోర్డు ఆసక్తి చూపడం లేదు. ఈ కారణాల రీత్యా, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో 2027 వన్డే ప్రపంచకప్ వరకు గంభీర్ హెడ్ కోచ్‌గా కొనసాగడం దాదాపు ఖాయమని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

# లంకలో టీమిండియా పేసర్లకు కఠిన పరీక్ష

## రాణించాలంటే ఇవి తప్పవన్న మోర్కెల్




శ్రీలంక పర్యటనలో భారత ఫాస్ట్ బౌలర్లకు కఠిన సవాళ్లు ఎదురుకానున్నాయని, వాటిని అధిగమించాలంటే త్వరగా పరిస్థితులకు అలవాటుపడాలని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ సూచించారు. లంకలోని తీవ్రమైన వేడి, ఉక్కపోతతో పాటు కుకబుర్రా బంతి స్వరూపం మారడాన్ని అర్థం చేసుకుని, ఒత్తిడిని సృష్టించేందుకు సృజనాత్మకంగా ఆలోచించడం చాలా కీలకమని ఆయన స్పష్టం చేశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌లో భారత పేసర్లు తీవ్రతను కొనసాగించడం అత్యవసరమని మోర్కెల్ పేర్కొన్నారు. కీలక పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మోకాలి గాయంతో ఈ సిరీస్‌కు దూరం కావడంతో భారత పేస్ దళానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ప్రస్తుతం జట్టులో మహమ్మద్ సిరాజ్ అత్యంత అనుభవజ్ఞుడైన పేసర్‌గా మారాడు. ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, కొత్తగా జట్టులోకి వచ్చిన అకిబ్ నబీలతో భారత పేస్ దళం బరిలోకి దిగనుంది. శ్రీలంక పరిస్థితులపై మోర్కెల్ మాట్లాడుతూ, "ఇక్కడికి రావడంలో అతిపెద్ద సవాలు వేడి, ఉక్కపోత. అలాగే, కుకబుర్రా బంతి 25-30 ఓవర్ల తర్వాత మెత్తబడిపోతుంది. ఈ వాస్తవాన్ని మనం అంగీకరించాలి. ఇలాంటి పరిస్థితుల్లో అంతా మన మైండ్‌సెట్‌పై ఆధారపడి ఉంటుంది. ఫాస్ట్ బౌలర్‌గా చిన్న స్పెల్స్ వేసినా, బంతిపై పూర్తి శక్తిని ప్రయోగించి సరైన ప్రాంతాల్లో సంధిస్తే అవకాశాలు వాటంతట అవే వస్తాయి" అని వివరించారు. బంతి కొత్తగా ఉన్నప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆ తర్వాత అవకాశాలు సృష్టించుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాలని మోర్కెల్ సూచించారు. "టెస్ట్ మ్యాచ్ సాగేకొద్దీ పిచ్‌పై బౌన్స్ హెచ్చుతగ్గులుగా మారే అవకాశం ఉంది. మేం గత కొన్ని నెలలుగా రెడ్-బాల్ క్రికెట్ ఎక్కువగా ఆడలేదు. కాబట్టి తిరిగి ఆ ఫార్మాట్‌లోకి రావడం కూడా ఒక సవాలే. నిలకడగా ఓవర్లు వేస్తూ తీవ్రతను కొనసాగిస్తే బ్యాటర్లపై ఒత్తిడి పెంచవచ్చు," అని ఆయన అన్నారు. బంతి పాతబడిన తర్వాత క్రీజును ఉపయోగించుకోవడం, షార్ట్ బంతులను వ్యూహాత్మకంగా ప్రయోగించడం వంటి విషయాల్లో "స్ట్రీట్ స్మార్ట్"గా ఆలోచించాలని మోర్కెల్ తన బౌలర్లకు పిలుపునిచ్చారు. ఆగస్టు 15 నుంచి గాలేలో తొలి టెస్టు, ఆగస్టు 23 నుంచి కొలంబోలో రెండో టెస్టు జరగనున్నాయి.

# భారత్-ఆఫ్ఘన్ టీ20 సిరీస్


## సోనీకి టీవీ ప్రసార హక్కులు




భారత క్రికెట్ అభిమానులకు ఒక ముఖ్యమైన అప్‌డేట్. టీమిండియా, ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ టెలివిజన్ ప్రసార హక్కులను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ కైవసం చేసుకుంది. ఈ సిరీస్ గ్లోబల్ హక్కులను కలిగి ఉన్న ఐటీడబ్ల్యూ యూనివర్స్ సంస్థ, పలు బ్రాడ్‌కాస్టర్లతో చర్చల అనంతరం టీవీ హక్కులను సోనీకి కేటాయించింది. అయితే, డిజిటల్ ప్రసార హక్కులు మాత్రం ఫ్యాన్‌కోడ్ వద్దే ఉంటాయని స్పష్టం చేసింది. బీసీసీఐ ఆమోదం పొందిన షెడ్యూల్ ప్రకారం, ఈ సిరీస్‌ను 2026 సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్వహించాల్సి ఉంది. ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) ఈ సిరీస్‌కు ఆతిథ్యం ఇస్తోంది. ఇదిలా ఉండగా, ఈ సిరీస్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేయాలని ఐటీడబ్ల్యూ యూనివర్స్ వ్యవస్థాపకుడు భైరవ్ శాంత్, ఏసీబీ సీఈఓ నసీబ్ ఖాన్‌కు లేఖ రాశారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగ ఉన్నందున, ఆ రోజు ఒక మ్యాచ్‌ను నిర్వహించేలా షెడ్యూల్ సవరించాలని కోరారు. ఇందుకుగాను సెప్టెంబర్ 13, 14, 16 (లేదా 17) తేదీల్లో మ్యాచ్‌లు జరపాలని ఒక ప్రత్యామ్నాయాన్ని సూచించారు. భారత్‌లో వినాయక చవితికి ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పు చేయాలని, ఇది భారత అభిమానుల పట్ల సద్భావనకు, బీసీసీఐ-ఏసీబీ సంబంధాల బలోపేతానికి దోహదపడుతుందని శాంత్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తిపై ఏసీబీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

# టెస్టుల్లో మిచెల్ స్టార్క్ ప్రపంచ రికార్డు..


## అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా చరిత్ర




ఆస్ట్రేలియా వెటరన్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఎడమచేతి వాటం బౌలర్‌గా చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో శ్రీలంక దిగ్గజ స్పిన్నర్ రంగనా హెరాత్ (433) రికార్డును అధిగమించాడు. బంగ్లాదేశ్‌తో డార్విన్‌లోని మరారా క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న తొలి టెస్టులో ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఓపెనర్ షాద్మాన్ ఇస్లామ్‌ను ఔట్ చేయడం ద్వారా స్టార్క్ తన టెస్టు వికెట్ల సంఖ్యను 434కి పెంచుకున్నాడు. తన 106వ టెస్టులో ఈ మైలురాయిని చేరుకున్న స్టార్క్, భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ (434 వికెట్లు) రికార్డును సమం చేశాడు. ప్రస్తుతం టెస్టుల్లో ఆల్-టైమ్ వికెట్ టేకర్ల జాబితాలో 10వ స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్ (439) రికార్డును బద్దలు కొట్టడానికి స్టార్క్ కేవలం ఆరు వికెట్ల దూరంలో ఉన్నాడు. ఈ రికార్డుతో ఎడమచేతి వాటం బౌలర్ల జాబితాలో స్టార్క్ అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. రంగనా హెరాత్ (433), పాకిస్థాన్ గ్రేట్ వసీం అక్రమ్ (414), న్యూజిలాండ్ స్పిన్నర్ డానియల్ వెటోరి (362), శ్రీలంక పేసర్ చమిందా వాస్ (355) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 348 వికెట్లతో ఈ జాబితాలో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. అయితే, వ్యక్తిగత రికార్డులపై తాను పెద్దగా దృష్టి పెట్టనని, జట్టు ప్రయోజనాలే ముఖ్యమని ఈ సిరీస్‌కు ముందు స్టార్క్ పేర్కొన్నాడు. ఐసీసీ కథనం ప్రకారం.. "ఇలాంటి దిగ్గజాల సరసన నా పేరు వినిపించడం గౌరవంగా ఉంది. కానీ, ఆడుతున్నప్పుడు ఈ గణాంకాలకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు" అని స్టార్క్ తెలిపాడు. కాగా, స్టార్క్ ఈ చారిత్రక ఘనత సాధించిన రోజే ఆస్ట్రేలియా జట్టు బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్, బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి కేవలం 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ 55 పరుగులిచ్చి 6 వికెట్లతో కెరీర్ బెస్ట్ ప్రదర్శన చేశాడు. ఆసీస్ తరఫున స్టీవ్ స్మిత్ (71) ఒక్కడే పోరాడాడు.

# ఐపీఎల్ ఆడితే సరిపోదు.. రంజీలు ఆడాల్సిందే

## టీమిండియా ఎంపికపై కపిల్ దేవ్ ఘాటు వ్యాఖ్యలు



భారత క్రికెట్ జట్టు ఎంపిక విధానం, ఇటీవల భారత బ్యాటర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై లెజెండరీ క్రికెటర్ కపిల్ దేవ్ బీసీసీఐకి కీలక సూచనలు చేశారు. భారత సీనియర్, జూనియర్ క్రికెటర్లు ఈ మధ్యకాలంలో స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఘోరంగా విఫలమవుతున్నారని... స్వదేశంలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి జట్లతో టెస్టుల్లో ఓడిపోవడం దారుణమని ఆయన అన్నారు. ఈ పరిస్థితులకు దేశవాళీ క్రికెట్‌ను నిర్లక్ష్యం చేయడమే ప్రధాన కారణమని కపిల్ దేవ్ విశ్లేషించారు. కేవలం ఐపీఎల్‌లో మెరిసినంత మాత్రాన జాతీయ జట్టులోకి ఎంపిక చేయడం వల్ల జట్టుకు తీవ్ర నష్టం జరుగుతోందని... దేశవాళీ క్రికెట్‌లో (రంజీ ట్రోఫీ వంటి టోర్నీల్లో) నిలకడగా రాణించిన వారిని మాత్రమే టీమిండియాకు ఎంపిక చేయాలని కోరారు. సీనియర్ ఆటగాళ్లు కూడా తప్పనిసరిగా దేశవాళీ మ్యాచ్‌లు ఆడేలా బీసీసీఐ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, టీ20 మ్యాచ్‌లు పెరిగిపోతుండటంతో జస్ప్రీత్ బుమ్రా వంటి కీలక ఫాస్ట్ బౌలర్లు తరచూ గాయాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటగాళ్ల వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌పై బీసీసీఐ తక్షణమే స్పందించి సరైన నిర్ణయం తీసుకోవాలని హితవు పలికారు.

# సర్జరీ తర్వాత ఎన్టీఆర్ తొలి ఫోటో వైరల్!




యంగ్ టైగర్ ఎన్టీఆర్ భుజానికి హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స విజయవంతంగా ముగిసిన సంగతి తెలిసిందే. సర్జరీ అనంతరం వైద్యుల బృందంతో కలిసి తారక్ దిగిన తొలి ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ పిక్‌లో ఆయన చేతికి సపోర్టివ్ బెల్ట్ వేసుకొని చిరునవ్వుతో కనిపించారు. తారక్ కోలుకుంటున్న తీరు చూసి ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం..నిన్న కిమ్స్ ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో జరిగిన శస్త్రచికిత్స తర్వాత ఎన్టీఆర్ హెల్త్ కండిషన్ నిలకడగా ఉంది. ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ల టీమ్‌తో ఎన్టీఆర్ దిగిన ఫొటో ఈరోజు బయటకు వచ్చింది. ఇక ఇందులో తారక్ చేతికి బెల్ట్ ధరించి కనిపించినప్పటికీ, ఆసుపత్రి వర్గాలతో ఎంతో ఆరోగ్యంగా, చిరునవ్వుతో సంభాషిస్తున్నట్లుంది. ఈ పిక్ చూసిన తర్వాత ఫ్యాన్స్ అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇక జూలై 27న ఒక యాక్టివిటీ సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైందని ఆయన టీమ్ అధికారిక ప్రకటనలో తెలిపింది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' మూవీ యాక్షన్ సీన్ల చిత్రీకరణ సమయంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ఇక తీవ్రమైన నొప్పి ఉండటంతో వైద్యుల సలహా మేరకు కిమ్స్ హాస్పిటల్‌లో ఆగస్టు 12న సర్జరీ చేయించుకోవాల్సి వచ్చింది. డాక్టర్ల బృందం తెలిపిన వివరాల ప్రకారం..

ఎన్టీఆర్ భుజం గాయం పూర్తిగా నయమై సాధారణ స్థితికి రావడానికి దాదాపు 2 నుంచి 3 నెలల సమయం పడుతుంది. ఇక అంతవరకు ఆయన పూర్తి విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇక ఎలాంటి ఇబ్బంది లేదని, ఆరోగ్యం విషయంలో అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కిమ్స్ మెడికల్ వర్గాలు స్పష్టం చేశాయి.

# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం


అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.



# సినీ లవర్స్‌కు పండగే పండగ

## నేడు ఒక్కరోజే ఆరు సినిమాలు విడుదల




పంద్రగాస్ట్ సినీ లవర్స్‌కు పండగ చేయబోతోంది. పలు సినిమాలు 14న శుక్రవారం విడుదల కాబోతున్నాయి. ఇందులో సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితా బైజు కథానాయిక. రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై అంచనాలను పెంచింది. పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్ (సూర్య) కొడుక్కి ఉన్న ఆరోగ్య సమస్య ఓ సవాల్‌గా మారుతుంది. ఆ బాబు ఆపరేషన్‌కి అవసరమైన అవయవదాతను వెతుకుతుండగా మ్యాడీ అనే యువతి పరిచయమవడం.. ఆమె రాకతో ఆ తండ్రీకొడుకుల జీవితాలు ఎలా మారాయన్నది చిత్ర కథ. విచిత్రమైన పాత్రలు... సరదా సంఘటనలు... ఊహించని మలుపులతో రూపొందుతున్న సినిమానే మా 'పళ్ళ బురుసు' అంటున్నారు ఉదయ్ చౌహాన్. ఆయన దర్శకత్వంలో.. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో రూపొందింది. 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. కామెడీ, భావోద్వేగాల మేళవింపుగా ఓ పల్లెటూరి కథతో మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.'ఆధ్యాత్మిక అంశాలతో మిళితమై ఉన్న మిస్టిక్ థ్రిల్లర్ 'అగధ' అంటున్నారు హీరో శ్రవణ్ రెడ్డి. ఆయన కీలక పాత్రలో కామాక్షి భాస్కర్ల, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. ఎంఎస్ రాజు తెరకెక్కించారు. ఆగస్టు 14న ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో భయపెట్టే అంశాలు మాత్రమే కాదు... అంతకుమించిన కథ ఉందని చిత్ర బృందం చెబుతోంది. 'నేటి యువతరానికి కనెక్ట్ అయ్యే సినిమా 'హుషార్ పిట్టలు'. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది' అంటున్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. అన్ను, వాసవి గణెళిశన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని బిక్షు తెరకెక్కించారు. వెంకట్ యాదవ్ నిర్మించారు. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ సంస్థ విడుదల చేస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఈ సమాజంలో కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా దీన్ని రూపొందించినట్లు దర్శకుడు చెబుతున్నారు. ఇకపోతే విశాల్ కథానాయకుడిగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన చిత్రం 'మకుటం'. ఆర్బీ చౌదరి నిర్మాత. దుషార విజయన్, అంజలి కథానాయికలు. ఈ మూవీ తమిళ, తెలుగు భాషల్లో 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. లింగ, కృపాకర్ అనే రెండు వైవిధ్యమైన పాత్రల్లో మూడు విభిన్న గెటప్పులలో విశాల్ కనిపించిన విధానం.. యాక్షన్ అలరిస్తున్నాయి. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలో 2007లో దర్శకుడు మోహిత్ సూరి తెరకెక్కించిన సినిమా 'ఆవారాపన్'. ఇప్పుడీ సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'ఆవారాపన్ 2'. ఇమ్రాన్ హష్మీ, దిశా పటానీ జంటగా నటిస్తున్నారు. నితిన్ కక్కర్ దర్శకుడు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ఇమ్రాన్ డైలాగ్స్‌తో పాటు దిశా నటన అలరిస్తోంది. ఇమ్రాన్ ఇందులో శివమ్ పండిట్ పాత్రలో కనిపించనున్నారు. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బట్వారా 1947' ప్రీతి జింటా, షబానా ఆజ్మీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. బాలీవుడ్ కథానాయకుడు ఆమిర్ ఖాన్ నిర్మాణ సంస్థ రూపొందించిన చిత్రమిది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14న విడుదల కానుంది. దేశ విభజన కాలం నాటి హింసాత్మక పరిస్థితుల మధ్య చిక్కుకున్న ఓ కుటుంబ నేపథ్యంలో భావోద్వేగభరితంగా ఈ సినిమాను తీర్చిదిద్దారు.



# లోకేశ్ కనగరాజ్ చిత్రం డిసికి పెరుగుతున్న కలెక్షన్లు

కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342